# అగ్గిపుల్ల

సికింద్రాబాదులో కొంతకాలం క్రితం, ఒక పెట్రోలు బంకులో నిజంగా జరిగిన సంఘటనే ఈ కథకు ఇతివృత్తం.

ఒకరోజు ఒక లారీ వచ్చి ఆగింది. సర్దార్‌జీ అయిన డ్రైవరు లారీ నుంచి దిగకుండా టాంకు నిండా డీజల్ పోయమని చెప్పాడు. దానితో ఒక ఖాళీ బీర్‌బాటిల్ ఇచ్చి దానినిండా పెట్రోల్ తీసుకురమ్మని గూడా ఆదేశించాడు. పెట్రోలు దేనికని, అడుగుదామని ఆ బంకులో కుర్రవాడు అనుకున్నాడు కానీ, ఆ సర్దార్‌జీ ముఖంలో భావం చూసి అతనిని ఏదైనా ప్రశ్న అడగడం, అతనికి నచ్చదని మానుకున్నాడు. అతను చెప్పినట్టు చేయడమే, తన ఆరోగ్యానికి మంచిదని ఆ అబ్బాయి సరియైన సమయంలో తెలుసుకున్నాడు. లారీ టాంక్‌లో డిజల్ పోయమని తన మిత్రుడికి చెప్పిన తరువాత ఆ బీర్‌బాటిల్‌లో పెట్రోలు పోసి, అతను దాన్ని సర్దార్ రూపంలో వున్న ఆ మహాసారథికి అర్పించాడు. ఇంతలోపల లారీ క్లీనర్ బయటకు వచ్చి డిజిల్ పోయడాన్ని చూడటం, టైర్లన్నీ మంచి కండిషన్‌లో వున్నాయా లేవా అని చెక్ చేయడం ఇత్యాది మహాకార్యాలకు బాధ్యత వహించాడు. బాటిల్ చేతికి రాగానే ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఒక్క గుక్కలో పానయోగ్యం కాని, ఆ ద్రావకాన్ని సర్దార్‌జీ తాగేసాడు. తదుపరి నిండుగా త్రేన్చాడు. డబ్బు ఇచ్చి రసీదు తీసుకుని, క్లీనరు లారీలో ఎక్కగానే సర్దార్‌జీ బండి స్టార్ట్ చేశాడు.

''సుబ్బారావు అలాగే నోరుతెరుచుకొని చూస్తూ వుండిపోయాడు. అతనితో పనిచేస్తున్న ఫరీద్ దగ్గరకు వచ్చి భుజం మీద తట్టి ''క్యా భాయ్'' ఏంటి? అంత ఆశ్చర్యంతో చూస్తున్నావు? అని అడిగినప్పుడు మాత్రమే సుబ్బారావు బయటి ప్రపంచంలోకి తిరిగి రాగలిగాడు.

''ఫరీద్ భాయ్ నీవు చూడలేదా, ఆ సర్‌దార్‌జీ ఒక బాటిల్ పెట్రోల్ తాగేసి వెళ్లిపోయాడు.''

''దానికెందుకంత ఆశ్చర్యం? ఇలాంటి వాళ్లు చాలా మంది వున్నారు. నువ్విది మొదటిసారా చూసేది?''

''కాని, పెట్రోలు తాగితే మనుషులు చచ్చిపోరా?''

''పెట్రోలు కాదు, దాని బాప్‌ను తాగినా చచ్చిపోర్రా.''

''ఇక్కడ ధూల్‌పేటలో తయారుచేసే సారా వుందికదా! అది పెట్రోలు కన్నా మంచిదనుకున్నావా?''

ఆ సంభాషణ అలాగే కొంచెం దీర్ఘంగా జరిగింది. మెల్లమెల్లగా సుబ్బారావు ఆశ్చర్యం నుంచి, స్తబ్దత నుంచి బయటకు వచ్చాడు. దాని తరవాత, దాదాపు ఆరు నెలల వరకు అలాంటి దృశ్యం మళ్లీ చూసే మహద్భాగ్యం సుబ్బారావుకు దక్కలేదు. ప్రపంచంలో ఎనిమిదవ అద్భుతాన్ని చూసినట్లు అలాంటి దృశ్యం ఇంకోసారి కూడా చూడాలనే ఒక నిరంతర తృష్ణ అతనిని వెంటాడింది. రోజు ఎన్నో లారీలు వస్తున్నాయి. చాలా లారీలలో డ్రైవర్లుగా పెద్ద పెద్ద సర్‌దార్‌జీలు కూడా వస్తున్నారు. కానీ, ఏ ఒక్కరూ పెట్రోలు అడుగలేదే! ఛ, ఛ, ఆ పాత సర్‌దార్‌జీకి ఏమైంది? అతను ఎందుకు మళ్లీ ఇటు రాలేదు? అతను పెట్రోలు తాగి చచ్చి పోయాడేమో! ఫరీద్ భాయ్ అభిప్రాయంలో పెట్రోలు తాగితే ఎవరూ చావరనేగా! అయితే అతను మరి ఎందుకు రాలేదు! లేకపోతే ఎంతోమంది సర్‌దార్‌జీ డ్రైవర్లు వచ్చినప్పుడు, వారిలో కనీసం ఒక్కడు కూడా ఎందుకు పెట్రోలు తాగలేదు?''

ఇలాగే ఆలోచించి, ఆలోచించి, ఒకటి రెండుసార్లు, తనే కొంచెం పెట్రోలు తాగి, దాని ఎఫెక్టు పరీక్షిస్తే ఎలా వుంటుంది, అన్న ఆలోచనా అతనికి వచ్చింది.''

''బీర్, విస్కీ అలాంటివి తాగి చూసిన అతనికి మామూలు సారా తాగడానికి కూడా ధైర్యం లేకపోవడం వల్ల పెట్రోల్ అనే మహత్‌సారా లోపలికి వేసుకోవడానికి ధైర్యం రాలేదని మాత్రమే కాకుండా, మహాభయం కలిగింది కూడా. అలాగే రోజులు గడుస్తాయి.

ఒకరోజు ఉదయం దాదాపు 11 గంటలు అయివుంటుంది. పెట్రోలు బంకులో హడావుడి తగ్గిన సమయమది. సుబ్బారావు ఒక ప్రక్కన వున్న చెట్టుక్రింద కూర్చుని న్యూస్ పేపరు చదువుతున్నాడు. తన ప్రక్కన ఇంకొకరు వచ్చి కూర్చోవడం కొంచెం ఆలస్యంగా అతను గమనించాడు. అతన్ని చూస్తే, వట్టి తాగుబోతులా అనిపించాడు. అతని కళ్లు పసుపు పచ్చగా వున్నాయి; ముఖము బాగా రక్తవిహీనంగా వుంది. జుట్టు

పిచ్చుక గూడులా వుంది. అతను ఒక మోస్తరు ప్యాంట్, షర్ట్ వేసుకున్నాడు. షర్టు జేబులో ఒక గోల్డ్‌ఫ్లాక్ సిగరెట్ పాకిట్, ఒక అగ్గిపెట్టె, కొన్ని కాగితాలు వున్నట్టు కనిపించింది. అతనికి పిచ్చివున్నట్టు లక్షణాలు లేవు కానీ, పిచ్చిరావడానికి ఇంక ఎక్కువ ఆలస్యం లేనట్లు ఆ ముఖం స్పష్టంగా తెలుపుతూంది.''

''బాబూ ఇక్కడ నువు పని చేస్తున్నావు కదా?'' అని అతనే సంబాషణ మొదలు పెట్టాడు. అవునని సుబ్బారావు చెప్పగానే ఏదో రహస్యం చెబుతున్నట్టు ''అయితే నాకొక సీసా పెట్రోలిస్తావా'' అని అడిగాడు.

''పెట్రోలంటే, సులువుగా దొరుకు తుందనుకున్నావా?''

''కాదు బాబూ నేను డబ్బిస్తాను'' అని చెప్పి అతను షర్టు జేబునుంచి, సిగరెట్ ప్యాకెట్, అగ్గిపెట్టె బయటకు తీశాడు. వెంటనే ''ఏయ్, ఇక్కడ సిగరెట్ కాల్చకూడదు.'' అని సుబ్బారావు అతనిని ఆపడానికి ప్రయత్నించాడు.

''లేదు సారూ, త్రాగడానికి కాదు, ఇది బయటకు తీసేది, ఆ విషయం నాక్కూడా తెలుసు. డబ్బులు బయటకు తీయాలి కదా'' అని చెబుతూ, జేబులో నున్న కాగితాల మధ్యనుంచి ఒక పది బయటకు తీసి సుబ్బారావు చేతికిచ్చాడు.

''నీ కెందుకు పెట్రోలు? తాగడానికా?'' అని అపహాస్య స్వరంతో అడిగాడు.

''అవును బాబూ, అవును మామూలుగా నేను, పెట్రోలు తాగను. నాకిష్టమయింది సారాయే. కాని ఎప్పుడో ఒకసారి పెట్రోలు తాగాలి అనిపిస్తుంది.''

''ఈ పెట్రోలు, సారా తాగితే రెండూ ఒకే మాదిరుంటాయా?

''మామూలు వేడి నీళ్లు చల్లటి సోడా. ఇవి రెండూ త్రాగేటప్పుడు ఎంత వ్యత్యాసముంటుందో, అలాగుంటుంది ఇవి త్రాగేటప్పుడు గూడా. సారా అయితే అలా వేడివేడిగా లోపలికి వెళుతుంది; పెట్రోలు అయితే చాలా చల్లగా లోపలికెళు తుంది. కానీ, బాగా వాంతి అవుతున్నట్టు అనిపిస్తుంది.''

''మీరు నిజంగా త్రాగబోతున్నారా! అయితే ఇప్పుడే తీసుకొస్తాను.'' అని చాలా సంతోషంగా చెబుతూ, పరుగెత్తికెళ్లి, ఒక సీసా నిండా పెట్రోలు తీసుకువచ్చి, ఆ అపరిచితుడికి ఇచ్చాడు. దాన్ని ఆబగా లాక్కుని గబగబా తాగేశాడు. ఎంతో కాలంగా ఆ దృశ్యం కోసం ఎదురు చూస్తున్న సుబ్బారావుకు, అది చూడగానే ఎంతో సంతృప్తి కలిగింది. ఒక్క విషయం అతనికి అర్థమయింది. కల్లు తాగినట్లు కొద్ది కొద్దిగానే ఈ పెట్రోలు తాగటానికి వీలులేదు. ఒకటే గుక్కలో లోపలికి పోవాలి. లేకపోతే వాంతులు రావచ్చేమో. పెట్రోలు తాగేటప్పుడు, అతని ముఖంలో భావం ఎలా మారుతుంటుందో సుబ్బారావు శ్రద్ధగా గమనించాడు. అసహ్యమయిన ఒక పదార్థం

నోట్లోనుంచి కడుపులోకి వెళ్లేటప్పుడు, మామూలుగా మనుష్యులు ఎలా ముఖం పెడతారో, ఆయన ముఖం కూడా అలాగే ఉంది. పూర్తిగా తాగిన తరువాత అతనికి వాంతికి వస్తునట్టు కూడా అయింది. అయినా కూడా, అక్కడ వాంతి చేసుకోకుండా, ఒక చేయిని నోటికి అడ్డంగా పెట్టుకుని, కొద్దిగా వంగి రోడ్డుకు అవతలి వైపుకు మెలమెల్లగా నడచి వెళ్లాడు. అక్కడ ఒక చిన్న 'ఫర్నీచర్ షాపు' కు ముందున్న అరుగుపై కూర్చున్నాడు. సుబ్బారావు కళ్లు అతని ప్రతి కదలికను గమనిస్తున్నాయి.

జేబునుంచి సిగరెట్ ప్యాకెట్ బయటకు తీసి ఒక సిగరేట్, నోట్లో పెట్టుకుని రెండు 'చేతులతో అగిపుల్ల వెలిగించి, గాలిలో' అది ఆరిపోకుండ రెండు చేతులు అడ్డంగా పెట్టుకుని నోటిదగ్గరకు దాన్ని తీసుకు పోవడం కూడా సుబ్బారావు గమనించాడు.

ఆ క్షణంలో---''ఏదో పగిలినట్టు శబ్దం వచ్చింది. ఆ త్రాగుబోతు నాలుగైదు అడుగులు ముందుకు పరుగెత్తి. నడి రోడ్డులో పడి దొర్లుకుంటూ, కాళ్లుచేతులు కొట్టుకోవడం సుబ్బారావు మాత్రమే కాదు ఇంకా చాలా మంది చూశారు. జనం అతని చుట్టూ గుమికూడారు. ఆయన పొట్ట పగిలి, పేగులన్నీ బయటకు వచ్చేశాయి. కొన్ని క్షణాలు మాత్రం ఆ పొట్టలోపల మంటలు మండాయి. పచ్చి మాంసం కాలేటప్పుడు వచ్చే కరకు వాసన అక్కడంతా వ్యాపించింది. దాదాపు మూడు లేక నాలుగు నిముషాలు కొట్టుకుంటూ దుస్సహవేదన అనుభవిస్తున్న ఆ దేహం చలన రహితమయింది. అతని కళ్లు బయటకు పొడుచుకొని వచ్చాయి. తెరచివుంచిన నోటిలో నల్లబడిన నాలుక, కాలిపోయిన పెదవులు చూసిన సుబ్బారావుకు ఒక భూతాన్ని చూసినట్టు అనిపించింది. మరో నిముషంలో తల తిరగడం మొదలయి, కళ్లలో చీకటి వ్యాపించింది.

సుబ్బారావు స్పృహలోకి రావడానికి ఎక్కువ సమయం పట్టలేదు. పెట్రోలు బంకులో పనిచేసే మిగతా కుర్రవాళ్లు, అతన్ని తీసుకొనిపోయి ఆఫీసులో పడుకోబెట్టి, కొద్దిగా నీళ్లు అతని ముఖంమీద చిలకరించడంతోనే అతను కళ్లు తెరిచాడు. అతను మళ్లీ రోడ్డువైపు చూసేసరికి అక్కడ గుమిగూడిన జనం రొద ఇరుప్రక్కలనుంచి వచ్చి చేరిన వాహనాల శబ్దం కలిసి ఎంతో గందరగోళంగా వుంది. అక్కడేమి జరిగినా సుబ్బారావు మళ్లీ ఆవైపు వెళ్లలేదు.

సుబ్బారావుకి మాత్రమేకాదు, పెట్రోలు బంకులో పనిచేసే ఇంకో ఇద్దరు అబ్బాయిలు కూడా పోలీసు స్టేషన్ లాకప్‌లో రెండు, మూడు రోజులు గడపాల్సి వచ్చింది. పోలీసు వాళ్లు చేతుల్లో వాళ్లు బాగా దెబ్బలు తిన్నారు కూడా. జరిగిన విషయాలు జరిగినట్టు సుబ్బారావు వివరించాడు. పాత సర్‌దార్‌జీ విషయం కూడా అతను దాచిపెట్టకుండా చెప్పేశాడు.

పెట్రోలు బంకు యజమాని మంచితనం వల్లా బాగా డబ్బు ఖర్చు పెట్టడం వల్లా, సుబ్బారావుకు, అతని స్నేహితులకూ పోలీసు వాళ్ల పట్టునుంచి విముక్తి లభించింది.

ఎవరైనా పెట్రోలు త్రాగుతుంటే చూసి ఆనందించాలనే సుబ్బారావు కోరిక దానితో తీరిపోయింది. అతను తన జీవితంలో ఒక ప్రధానమైన నిర్ణయం తీసుకు న్నాడు.........

సర్ దార్ జీ సారథేకాదు, సాక్షాత్ దేవేంద్రుడు వచ్చి అడిగినా కూడా త్రాగడానికి ఇక పెట్రోలు మాత్రం ఇవ్వకూడదు, అన్నదే అది.